**వినయ విధేయతలు కలిగి ఉండాలి - నారంశెట్టి ఉమామహేశ్వరరావు**

పరహింసా పరకీయ విత్త హరణాభావంబు సత్యవ్రతా /

దరముం దానపరత్వ మన్యవనితోదంతోక్తి మూకత్వముం /

బరతృష్ణాఝురభంజనంబు గురునమ్రత్వంబునుం బ్రాణభృ /

త్కరుణా శాస్త్రసమత్వ సద్విధులు భద్రప్రాప్తికిన్ మార్గముల్ /

అంటోంది భర్తృహరి శతకం.

జీవహింసను విడిచిపెట్టమని , ఇతరుల ధనం మీద ఆశ పడకూడదని , ఎప్పుడూ నిజమే చెప్పమని , అవసరంలో ఉన్న వారికి సహాయపడమని, పరాయి స్త్రీల గురించి తప్పుగా మాట్లాడకూడదని, మౌనం పాటించమని , కోరికలను తగ్గించుకోమని , పెద్దలపట్ల వినయంగా ప్రవర్తించమని , సృష్టిలోని మిగతా ప్రాణుల మీద దయ చూపమని, అన్ని శాస్త్రాలను అధ్యయనం చేయమనియు పై పద్యం బోధించింది. ఆ పద్యంలో పేర్కొన్న పది నియమాలను పాటించినట్లైతే శ్రేయస్సు కలుగుతుందని వివరించింది.

పై పద్యంలోని పది నియమాల్లో ఎనిమిదవదే వినయం. పెద్దల పట్ల వినయాన్ని కలిగి ఉన్నట్టయితే శ్రేయస్సు కలుగుతుందని బోధించింది.

సాధారణంగా మనం మాట్లాడేటప్పుడు వినయ విధేయతలు అని జంట పదాలు పలుకుతాం. కాబట్టి వినయ విధేయతలు గురించి ఈ నెల వ్యాసంలో తెలుసుకుందాం.

వినయం అంటే మర్యాదగా, అణకువగా ఉండటం. మృదువైన, మర్యాదపూర్వక ప్రవర్తనతో మెలగడం. పెద్దలను గౌరవించడం, గురువులను మన్నించడం, సహనంతో మాట్లాడడం, గర్వం లేకుండా ప్రవర్తించడం, నేర్చుకోవడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండటం. ఈ లక్షణాలు వినయానికి చిహ్నాలు.

మనిషిని గౌరవనీయులుగా చూపించే వెలకట్టలేని ఆభరణమే వినయం . వ్యక్తిత్వాన్ని మెరుగుపరచి సమాజంలో సంబంధాలను బలపరిచే గొప్ప సుగుణం వినయం. వినయశీలురెప్పుడూ ఇతరుల పట్ల దయ, గౌరవం చూపిస్తారు. అందుకే ఎంతమందిలో ఉన్నప్పటికీ వాళ్లకున్న ప్రత్యేకత వల్ల త్వరగా గుర్తించబడతారు.

ఆజ్ఞలను పాటించడం, నియమాలకు కట్టుబడి ఉండటాన్ని విధేయత అంటారు. తల్లిదండ్రులు, గురువులు, పెద్దలు చెప్పిన మాటల్ని  వినడం, వాళ్లిచ్చే  సూచనలను పాటించడమంటే  విధేయతను చూపడమే అవుతుంది. వ్యక్తుల యొక్క  బాధ్యతను, క్రమశిక్షణను కూడ సూచిస్తుంది విధేయత.

నేటి బాలలేగ మేటి రేపటి వారు /

మాట మాటలందు మార్కులంద్రు/

విధిగ నేర్పరెవరు వినయ విధేయత/

నేటి చదువులందు నీతి లేదు/

అని రాఘవ మాష్టారు కేదారి వ్రాసినట్టు,  ఈ కాలం పిల్లల్లో వినయ విధేయతలు లోపించాయి. సరైన విధంగా పిల్లలు ప్రవర్తించడం లేదని, క్రమశిక్షణ లోపించిందని ఎక్కువగా వినబడుతోంది. అదెంతో చింతించాల్సిన విషయం.

ప్రభుత్వ కార్యాలయాల్లో, బ్యాంకుల్లో పనిచేసే  జూనియర్ ఉద్యోగులు వాళ్ల  సీనియర్స్ తో  గౌరవంగా ఉండడం లేదని, మర్యాదగా పలకరించడం తగ్గిపోయిందని  విచారం వ్యక్తం చేసిన వాళ్ళని చూసాను. వయోవృద్ధులు తమ పింఛను లేదా  ఇతర అవసరాల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లినప్పుడు వారిని తృణీకారభావంతో చూస్తున్నట్టు  మిత్రుల నోట ఆలకించాను . కొన్ని  పత్రికల్లో  వార్తలు కూడా  వచ్చాయి . అంతే కాదు . విద్యాలయాల్లో చదివే  విద్యార్థులు  తమకు విద్య నేర్పుతున్న  గురువుల్ని  సరిగా గౌరవించడం లేదని, కొన్ని చోట్లయితే  అవమానిస్తూ  కామెంట్లు చేస్తున్నారని కూడ తెలిసింది.  అది ఎంత కుసంస్కారమో కదా.

విద్య నేర్పే గురువుల్ని  పూజించడం మన  సంస్కృతి.  మన సంస్కృతి సంప్రదాయాలు, అలవాట్లను పారద్రోలి , విదేశీ వ్యామోహానికి లోబడిన పిల్లలు,  ఎక్కడెక్కడి  పద్ధతుల్లను అనుసరిస్తూ పెడత్రోవ పడుతున్నారనేది  బాధ కలిగించే విషయం.  దుస్తులు , వేషభాషలు, హావభావాలు, ఆఖరికి ప్రవర్తన కూడ విదేశీయుల మాదిరి అవలంబించడంతో వెయ్యి వెర్రి తలలు వేసినట్టు  సరస్వతీ నిలయాలైన విద్యాలయాలు సిగ్గు పడుతున్నాయి. ఇది ఎంతో బాధ కలిగించే విషయం.

“ఈనాటి బాలికలు రేపటి తల్లులు అవుతారు. ఈనాటి బాలురు రేపటి తండ్రులు అవుతారు. చిన్న వయసులో బాలబాలికలు  వాళ్ల  తల్లిదండ్రుల్ని  గౌరవించడం నేర్చుకుంటే,  రేపు వాళ్ల  పిల్లల నుండి  వాళ్లు కూడ సరైన గౌరవాన్ని పొందడానికి అర్హత సంపాదించుకుంటారు.  మొక్క చిన్నదిగా ఉన్నప్పుడు ఒంపులతో పెరిగితే పెద్దయ్యాక ఆ ఒంపులు పోవుకదా.  అందుకే చిన్నతనంలో ప్రవర్తన మంచిగా ఉండాలని”

సత్యసాయిబాబా చెప్పిన మాటల్ని అందరూ అర్థం చేసుకుని ఆచరణలో పెట్టాలి. వినయంగా ఉండడం వల్ల కలిగే ప్రయోజనాన్ని పిల్లలకు తెలిసేలా చెప్పాల్సిన బాధ్యత కూడ పెద్దలదే.

వినయంగా ఉండే వాళ్ళకు ఇతరుల అభిమానం దక్కుతుంది. కొత్త విషయాలు నేర్చుకోగలుగుతారు. వ్యక్తిత్వాన్ని మెరుగుపరుచు కోగలుగుతారు. అందరితో మంచి సంబంధాలు నెలకొల్పగలరు. అందరి నుండి ప్రేమాభిమానాలు, గౌరవాన్ని పొందగలరు. ఎక్కువ మందితో స్నేహం చేయడానికి అవకాశం కలుగుతుంది. అనేక వైపుల నుండి సహకారం లభించడం వల్ల విజయం సాధించడానికి అవకాశాలు పెరుగుతాయి.

ఇక విధేయత కలిగిన వాళ్లకు క్రమశిక్షణ తొందరగా అలవడుతుంది. బాధ్యత పెరుగుతుంది. పెద్దల ఆశీర్వాదాలు లభిస్తాయి. అనుకున్న పనుల్లో విజయం సాధించడం సానుకూలమౌతుంది.

" వినయ వివేకాదులను వృద్ధి పొందించుటకు అనుకూలపడని విద్య లేకపోయినచో దాని వల్ల వచ్చే నష్టం తక్కువేమీ కాదు. సుగుణ సంపద కేవలం డబ్బు గడించడానికి కాదు. చాలామంది మూఢులైన నిరక్షర కుక్షులు చేసే హాని కంటే ఒక్క చదువుకున్న దుష్టుడు చేసే హాని ఎక్కువ" అని కందుకూరి వీరేశలింగం పంతులు గారు ఎప్పుడో చెప్పారు. వారి మాటలు నిజమే అనిపించే పరిస్థితులు నేటి సమాజంలో కనబడుతున్నాయి.

ఇప్పుడు జరుగుతున్న సైబర్ నేరాలన్నీ బాగా చదువుకున్న ఇంజినీర్లు , కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న వాళ్లు చేస్తున్నవే. ప్రతి రోజు వేలాది మంది అమాయకుల బ్యాంకు ఖాతాల నుండి కోట్లాది రూపాయలను కొల్లగొడుతున్న వాళ్ళు బాగా చదువుకున్న వాళ్ళే. వాళ్లలా చేయడానికి కారణం ఏమిటంటే వాళ్ళంతా బ్రతకడానికి విద్య నేర్చుకున్నారు కానీ తప్పు ఒప్పులు, మంచి చెడుల విచక్షణ , నైతిక విలువలు నేర్చుకోలేదు. అందుకే తమ విజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ఎందరో అమాయకులకు ఏడుపు మిగులుస్తున్నారు.

"Education is for life and not for living" . "కేవలం జీవించడానికి విద్య కాదు. జీవితానికే విద్య కావాలి" అని చెప్పినట్టు ప్రస్తుత కాలంలో విద్యాబోధన జరగడం లేదు.

చదువులందు భక్తి శ్రద్ధలసలు లేవు/

మార్కులనుచు ర్యాంకు కోర్కెలాయె/

రాత మోత చదువు రోత లాయెను జూడ/

భావి పౌరులన్న బాధ్యతేది!?/

అని రాఘువ మాస్టారు కేదారి చెప్పినట్టు, విద్యాలయాల్లో విద్యను యాంత్రికంగా బోధిస్తున్నారు. విద్య నేర్చుకోవడం కేవలం ఉద్యోగం సంపాదించడం కోసమేనన్న భావం పిల్లల్లో ఏర్పడింది. ఫలితంగా క్రమశిక్షణ లోపించింది. వినయ విధేయతలు కనుమరుగయ్యాయి. ఇది వాళ్ల తప్పు కాదు. ఇంటి దగ్గర తల్లిదండ్రులకు చెప్పడానికి తీరిక ఉండదు. పాఠాలు చెప్పడంతోనే బడి సమయమంతా గడిచిపోతుండడంతో నీతిదాయక విషయాలు చెప్పడానికి ఉపాధ్యాయులకు తీరిక చిక్కడం లేదు. పిల్లలకు విలువలు, విలువైన విషయాలు తెలియడం లేదు. ఆ లోపాన్ని సవరించాల్సిన అవసరం ఏర్పడిందిప్పుడు .

వస్త్రేణ వపుషా వాచా విద్యయా వినయేన చ/

వకారైః పంచ భిర్హీనో నరో నాయాతి గౌరవమ్/

అంటోంది సంస్కృత సూక్తి రత్నావళి.

దాని భావం తెలుసుకుందాం. వస్త్రం, వపువు (శరీరం), వాక్కు , విద్య , వినయం అనే ఈ వకార పంచకం సరిగా ఉండని వారికి గౌరవం ఉండదని బోధించింది శ్లోకం.

అందుకే విద్యతో బాటు వినయాన్ని అలవరచుకోవాలి. చదువుతోపాటు సంస్కారాన్ని పెంపొందించుకోవాలి. వినయం లేని విద్యార్థి రాణించడు. అలాంటి వారి దగ్గరున్న విద్య శోభించదు. సంస్కారం లేని చదువు నిష్ప్రయోజనం. వివేకం లేని విజ్ఞానం వినాశనానికి దారి తీస్తుంది. ఆలోచనా రహితమైన మేధాశక్తి సర్వనాశనానికి దారితీస్తుంది. ఈనాటి విద్యలు తెలివితేటలు పెంచుతున్నాయి కానీ వినయ వివేకాదులను అభివృద్ధి పరచడం లేదు. సంస్కార వంతులుగా తయారు చేయడం లేదు.

"విద్య దదాతి వినయం, వినయాద్ యాతి పాత్రతాం, పాత్రత్వాత్ ధనమాప్నోతి, ధనాత్ ధర్మం తతః సుఖం".

ఆ శ్లోకం యొక్క భావమేమనగా 'విద్య వినయాన్ని ఇస్తుంది, వినయం పాత్రతను ఇస్తుంది, పాత్రత ధనాన్ని ఇస్తుంది, ధనం ధర్మాన్ని ఇస్తుంది, ధర్మం సుఖాన్ని ఇస్తుంది".

సరిగ్గా శ్లోకంలో చెప్పినట్టే పూర్వకాలం గురుకులాల్లో విద్యనభ్యసించిన విద్యార్థులంతా తమ గురువుల పట్ల పూర్తి విధేయతతో ఉండేవారు. ఇది వారి విద్యాభ్యాసానికి, వ్యక్తిత్వ వికాసానికి చక్కగా దోహదపడేది.గురుకుల విద్యార్థులు గొప్ప పరిపాలకులైన రాజుల కొలువుల్లో, ఉన్నతమైన పదవుల్లో చేరి, సేవలందించేవాళ్ళు. గురువు నుండి నేర్చుకున్న విద్యాబుద్ధులతో బాటు, మెప్పించే ప్రవర్తనతో దేశపరువు ప్రతిష్టలను నిలబెట్టేవారు.

అలాంటి మెప్పించే ప్రవర్తన కలిగినవారు పురాణాల్లో దర్శనమిచ్చారు. రామాయణంలో వర్ణించినట్టు శ్రీరాముడు తన తండ్రి దశరథుని ఆజ్ఞను శిరసావహించి, పదునాలుగు సంవత్సరాలు వనవాసం చేశాడు. ఇది ఆయన వినయ విధేయతలకు ఉదాహరణ.

గురువుగారైన శుక్రాచార్యుని దగ్గర వినయంగా ఉంటూ మృత సంజీవని విద్యను పొందగలిగాడు దేవతల గురువు బృహస్పతి కుమారుడు కచుడు.

శ్రవణ కుమారుడు గుడ్డి వాళ్ళైన తల్లిదండ్రులను మోస్తూ తీర్థయాత్రలకు తీసుకెళ్లాడు. ఇది ఆయన విధేయతకు, తల్లిదండ్రుల పట్ల భక్తికి నిదర్శనం.

చదువు నేర్పవలె సంస్కార సభ్యత /

వినయమున్నచోట విజయమబ్బు/

భౌతికముల కన్న నైతికతయె మిన్న/

శతక పద్య పఠన చదువులేవి!?/

అని రాఘవ మాష్టారు కేదారి చెప్పినట్టు, వినయంతో ప్రవర్తించి విజయం దక్కించుకున్నాడు అర్జునుడు . ఆ కథ చదువుదాం.

కురుక్షేత్ర సంగ్రామంలో సహాయం కోరడానికి కౌరవుల పక్షాన దుర్యోధనుడు, పాండవుల పక్షాన అర్జునుడు శ్రీకృష్ణుని దగ్గరకు వెళ్లారు. ముందుగా వెళ్లిన ధుర్యోధనుడు నిద్రపోతున్న శ్రీకృష్ణుడిని చూసాడు. రారాజునన్న అహంకారంతో కృష్ణుడి కాళ్లకి దగ్గరలో ఉన్న ఆసనం మీద కూర్చోకుండా తల వైపున్న ఆసనం మీద కూర్చున్నాడు దుర్యోధనుడు. తరువాత వెళ్ళిన అర్జునుడు వినయశీలి కావడంతో శ్రీకృష్ణుడి కాళ్ల దగ్గర ఉన్న ఆసనం మీద కూర్చున్నాడు. నిద్ర లేచిన కృష్ణుడు ముందుగా తన కాళ్ల దగ్గరున్న అర్జునుడిని చూసాడు. వాళ్లిద్దరినీ పలకరించాక వాళ్లు వచ్చిన పని అడిగి తెలుసుకున్నాడు.

'తన సైన్యం మొత్తం ఒకవైపు , ఆయుధం పట్టకుండా తానొకవైపు ఉంటానని' చెప్పి, వాటిలో ఏదైనా ఒకటి కోరుకునే అవకాశాన్ని ముందుగా అర్జునుడికి ఇచ్చాడు. తాను అర్జునుడినే ముందు చూసినందున అలా చేసినట్టు కృష్ణుడు ప్రకటించాడు. వచ్చిన అవకాశాన్ని చక్కగా సద్వినియోగం చేసుకున్నాడు అర్జునుడు. తమ వైపు శ్రీకృష్ణుడు ఉండాలని కోరుకున్నాడు.

మహాభారత యుద్ధంలో శ్రీకృష్ణుడు పోషించిన పాత్ర , కౌరవులకు జరిగిన పరాభవం అందరికీ తెలిసిందే. వినయమనే సుగుణమిచ్చిన గొప్ప ప్రయోజనాన్ని అర్జునుడి ప్రవర్తన తెలిపింది . ఆయన వినయశీలత వల్ల వ్యక్తిగతంగా పేరు ప్రతిష్టలు పొందడమే కాకుండా పాండవుల పక్షానికి విజయం వరించింది.

'సర్వజీవులనూ పోషిస్తున్న నీరు పల్లానికే ప్రవహిస్తుంది. గొప్పవాళ్లు కూడ అంతే నమ్రతతో ఉంటారన్న' సూక్తిని నిజం చేసిన ప్రముఖులున్నారు. వారి జీవితాల్లో ఎంతో వినయంతో ప్రవర్తించారని వాళ్ల జీవిత ఘట్టాలలోని అనేక సంఘటనలు తెలిపాయి .

మహాత్మా గాంధీ తన జీవితాంతం వినయంగా జీవించారు. ఆయన తన ప్రత్యర్ధులను కూడా గౌరవించేవారు. వినయంతో కూడిన వ్యక్తిత్వానికి ప్రతీకగా గాంధీజీని చెప్పుకుంటారు. సత్యమే పలకాలని బోధిస్తూ , అహింసా మార్గంలో నడుస్తూ ప్రపంచానికి వినయం యొక్క గొప్పతనాన్ని చాటి చెప్పారాయన.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఎంతో గొప్ప శాస్త్రవేత్త అయినప్పటికీ నిరాడంబరంగా ఉండేవారు. ఆయన జీవితం వినయానికి నిలువెత్తు నిదర్శనం. విద్యార్థులతో, చిన్న పిల్లలతో, సాధారణమైన వాళ్లతో కూడ ప్రేమగా, వినయంతో మెలిగేవారు.

భూదానోద్యమం ద్వారా ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక గురువు, తత్వవేత్త వినోభాభావే గారి వినయశీలత తెలిపే ఒక సంఘటన చదువుదాం. తనకి వచ్చిన ఉత్తరాలను ఎంతో శ్రద్ధగా భద్రపరిచే వారాయన. ఒకసారి ఆయనకు గాంధీజీ నుంచి ఉత్తరం వచ్చింది. దానిని చదివిన వెంటనే చింపి పారేశారాయన. ఆ సమయానికి ప్రక్కనే ఉన్న శ్రీకమలనయన్ బజాజ్ అది చూసి ఆశ్చర్యపోయాడు. నేల మీద పడి ఉన్న ఉత్తరం ముక్కల్ని ఏరి కూర్చి ఒకచోట పెట్టి చదివాడు.

అందులో "మీ వంటి గొప్ప వ్యక్తిని నా జీవితంలో చూడలేదు" అని గాంధీజీ రాసారు. అది చదివి ఆశ్చర్యపోయిన శ్రీకమలనయన్ బజాజ్ "అంత మంచి ఉత్తరాన్ని చించి పడేసారెందుకు? " అని అడిగాడు వినోబాభావే ని.

అందుకాయన " అందులో నా గురించి పొగడ్తలున్నాయి. అందుకే చించి పడేసాను. నాలో గర్వం , అహంకారం పెరుగుతాయన్న భయంతో ఆ పని చేశాను. ఒకవేళ నా గురించి విమర్శలు రాసిన ఉత్తరమైతే దాచుకునే వాడ్ని. నాలోని గొప్ప విషయాలు మాత్రమే గాంధీజీ చూసినట్టు రాసారు. ఆయనకి కనబడని లోపాలు నాలో ఎన్నున్నాయో నాకే తెలుసు. నాకు ఆత్మస్తుతి నచ్చదు. నన్ను విమర్శించే వాళ్లయితే నా ప్రక్కన కూర్చుండ బెట్టుకునే వాడిని " అన్నారు వినయంగా . ఆయనదెంత గొప్ప ఆలోచనా విధానమో తెలిసింది కదా. అదే సాధారణ వ్యక్తులైతే పొగడ్తలున్న ఉత్తరాన్ని పదికాలాల పాటు దాచుకుని, విమర్శలున్న ఉత్తరాన్ని చించి పడేసేవాళ్లు.

గురువు పట్ల వినయ విధేయతలు చూపిన శిష్యుల గురించి తెలిపే మరో సంఘటన చదువుకుందాం.

A poor teacher tells

An average teacher explains

A good teacher demonstrates

A great teacher inspires

అని అనుభవజ్ఞులు చెప్పినట్టు ఎందరో విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపిన మహనీయుడు డా. సర్వేపల్లి రాధాకృష్ణ. అధ్యాపకులను అవహేళన చేస్తున్న రోజుల్లో విద్యార్థుల ప్రేమాభిమానాలను పొందారు . విద్యార్థుల హృదయాలపై చెరగని ముద్ర వేసిన ఆచార్యుడుగా చరిత్రలో నిలిచిపోయారు. ఆయన మైసూరు విశ్వ విద్యాలయంలో రెండు సంవత్సరాలు ఆచార్యునిగా పని చేసాక బదిలీ మీద, కలకత్తా వెళుతున్న సమయంలో ఎందరో సహ అధ్యాపకులు , విద్యార్థులు వీడ్కోలు ఇవ్వడానికి ఆయన వసతి గృహానికి వెళ్లారు. ఆయన సామాన్లన్నీ వాళ్లే సర్దారు. రైలు స్టేషన్ కు వెళ్ళడానికి గుర్రపు బగ్గీని తీసుకువచ్చారు. సర్దిన సామాన్లు బగ్గీలో పెట్టారు . కొందరు విద్యార్థులు డా . సర్వేపల్లిని ఎత్తుకుని వెళ్లి బగ్గీలో కూర్చోపెట్టారు. మరికొందరు విద్యార్థులు బగ్గీకి కట్టిన గుర్రాలను వదిలేసి ఆ స్థానంలో తాము నిలబడి, కాడిని తమ మెడల పైన పెట్టుకుని, ప్రధాన నగర వీధుల మీదుగా రైల్వే స్టేషన్ వరకు లాక్కొని వెళ్లారు. జ్ఞానాన్ని ప్రసాదించిన గురువుకు ఆ విధంగా కృతజ్ఞతలు చెప్పుకున్నారు విద్యార్థులు . తన పట్ల విద్యార్థులు ప్రదర్శించిన భక్తికి, చూపిన వినయ విధేయతలకు, గౌరవానికి డాక్టర్ సర్వేపల్లి కళ్ళు చెమ్మగిల్లాయి. నగర వీధుల్లోని ప్రజలు ఆశ్చర్యపోతూ చూసారు.

పై సంఘటన చదివిన వారికి గురువుల పట్ల కృతజ్ఞత, పూజ్య భావం తెలపాలని అర్థమౌతుంది. ఆ విద్యార్థుల వినయ విధేయతలు చూసిన మిగతా విద్యార్థి లోకం, తమ గురువుల్ని గౌరవించాల్సిన విధానం తెలుసుకుంటుంది.

తమ గురువు గారిని గౌరవిస్తూ గుర్రాలు బదులుగా విద్యార్థులే బగ్గీ లాగినట్టు, వినయవిధేయతలు చూపినట్టు చదివాం కదా. అంతకు మించినదే కావచ్చు. ఒక ప్రాంతపు రాజుగారి ప్రవర్తన. ఆ రాజుగారి స్వయంగా స్వామి వివేకానంద ఉన్న గుర్రపు బగ్గీని లాగడం మరెంతో గొప్ప విశేషం . అదిప్పుడు తెలుసుకుందాం.

1893లో అమెరికాలోని చికాగోలో జరిగిన పార్లమెంట్ ఆఫ్ వరల్డ్ రిలిజియన్స్ (Parliament of the World's Religions) సదస్సులో స్వామి వివేకానంద చేసిన ప్రసంగం, ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. భారత సాంస్కృతిక వారసత్వాన్ని, హిందూ ధర్మాన్ని సమర్థంగా ప్రాతినిధ్యం వహించడంతో, స్వామీజీ విదేశాల నుంచి తిరిగి వచ్చాక ఆయనకు మన దేశంలో అపూర్వమైన స్వాగతం లభించింది.

1897లో స్వామి వివేకానంద తిరిగి దేశానికి వచ్చినప్పుడు ఆయన ప్రయాణించిన స్టీమర్ నుండి పంబన్ అనే గ్రామంలో దిగబోయారు. అప్పటికి రామనాడుకి రాజైన భాస్కర సేతుపతి గారు స్వామీజీకి ఎదురు వెళ్లి, ఆయన ముందు మోకాళ్లపై కూర్చుని మొదట తన తలపై కాలు మోపి తరువాత భారత భూమిపై దిగమని శిరస్సు వంచి ప్రార్థించారు. స్వామీజీ అందుకు సున్నితంగా తిరస్కరించి నేల మీదనే కాలు

మోపారు. ఆయన మాత్రమే కాకుండా రాజుగారి సమస్త పరివారం ఆయనకు సాష్టాంగ నమస్కారం చేసి , స్వయంగా రథంలో కూర్చుండ బెట్టారు. ఆ రథానికి పూన్చిన గుర్రాలను వదిలిపేసి , వాటి స్థానంలో స్వయంగా రాజుగారితో బాటు మరెందరో యువకులు కలసి ఆ రథాన్ని నగర వీధుల మధ్య నుండి నడిపించారు.

కలకత్తా ప్రజలు కూడా స్వామి వివేకానంద కూర్చున్న బగ్గీని భుజాలపై మోసారు. ఇది ఆయనపై వారు చూపిన అపారమైన ప్రేమ, భక్తి, గౌరవానికి ప్రతీకగా నిలిచింది. ఇదే కదా నిజమైన ఆధ్యాత్మిక వేత్తల పట్ల చూపాల్సిన వినయ విధేయత.

వినయంగా ప్రవర్తించడం ద్వారా కుటుంబంలో, పాఠశాలలో, సమాజంలో మర్యాదను పొందుతారు పిల్లలు. జీవన మార్గంలో వెలుగురేఖగా నిలుస్తుంది వినయం. అందుకే వినయంగా ఉండటాన్ని ఆచరించాలి. చిన్న వయసు నుండి కాన్వెంట్స్ కు, వసతి గృహాలకు, విద్యాలయాలకు పంపించి తమ బాధ్యత తీరిపోయిందని తల్లిదండ్రులు భావించడం వల్ల పిల్లలకు తల్లిదండ్రుల దగ్గర పెరిగే అవకాశం లేక పోతోంది. పిల్లలకు తల్లిదండ్రుల మనస్తత్వం అబ్బడం లేదు. వసతి విద్యాలయాల్లో వాళ్లకు సేవలందించే ఆయాలు , దాదుల మనస్తత్వమే అబ్బుతోంది. పిల్లల చదువుల విషయంలో ఇంట్లో తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి . వారి ప్రవర్తన గురించి పట్టించుకోవాలి. మంచి స్కూల్లో చేర్పిస్తే చాలు పిల్లలకు చదువు వస్తుందని నమ్మకూడదు. పిల్లలకు చదువు వస్తే రావచ్చు . కానీ సత్ప్రవర్తన, వినయ విధేయతలు అబ్బవు. సద్గుణాలు డబ్బుతో కొనలేనివి. విద్యాలయాల్లో కూడా మర్యాద, మన్నన, సత్ప్రవర్తన, సంస్కారం వంటి విషయాలు నేర్పాలి. విద్యాలయాల్లో చెప్పే చదువుల మీద ఆధారపడితే పిల్లల్లో నైతిక ప్రవర్తన అభివృద్ధి కాదు. కాబట్టి తల్లిదండ్రులు తమ వంతుగా పిల్లల్ని తీర్చిదిద్దాలి.

ఒకప్పుడు ఇంట్లో ఉండే స్త్రీలు ఆధ్యాత్మిక, పురాణ, ఇతిహాస, చారిత్రక గాథల్ని, దేశభక్తి భావాలను , నైతిక విలువల్ని కథలు, పాటల ద్వారా పిల్లలకు వినిపించేవారు. ఉత్తమ అధ్యాపకురాలు చేసే పనిని అప్పట్లో ఒక తల్లి చేసేది. అలాంటి పవిత్రమైన ఇల్లాలు ఈ కాలంలో డిటెక్టివ్ సాహిత్యం , క్షుద్ర సాహిత్యం చదువుతోంది. అలాంటి వాళ్ల పిల్లలు ఉత్తమ పౌరులుగా తయారవ్వాలంటే సులువు కాదు. అందుకు ఎంతో శ్రమపడాల్సిన అవసరం ఉంది.

పిన్నల పెద్దల యెడ గడు /

మన్ననచే మలగు సుజన మార్గంబుల నీ /

వెన్నికొని తిరుగుచుండిన /

నన్ని యెడల నెన్న బడదువన్న కుమారా !

అంటుంది కుమార శతకం.

"ఓ కుమారా। పిన్నల వద్ద, పెద్దల వద్ద ఎంతో గౌరవంతో మెలగాలి నువ్వు. మంచి మార్గాన్ని ఎన్నుకొని ప్రవర్తిస్తే అన్నిట్లో నీకు శుభం కలుగుతుంది. మంచి పేరు ప్రఖ్యాతులు లభిస్తాయి" అని పద్యం యొక్క భావం.

నిజమే. మంచి లక్షణాలతో పెరిగిన పిల్లలకు శుభాలు కలుగుతాయి. మంచి లక్షణాలైనా , విద్య అయినా ఎప్పుడు పడితే అప్పుడు అబ్బవు . దానికి ఒక సమయం , సందర్భం ఉన్నాయి.

'శైశవేభ్యస్త విద్యానాం' అన్నట్టు విద్య బాల్యంలోనే అభ్యసించాలి . అప్పుడే వంట పడుతుంది . ఆ వయసులో నేర్చుకున్నది జీవితాంతం గుర్తుంటుంది. మధ్యలో నేర్చుకున్నది మధ్యలోనే పోతుంది. కాబట్టి బాల్య దశను సద్వినియోగం అయ్యేట్లుగా చేయాలి .

తల్లిదండ్రులారా! మీ పిల్లలకు విద్యతో బాటు వినయ విధేయతలు వంటి మంచి లక్షణాలు నేర్పండి. అది వారి భవిష్యత్తుకు మాత్రమే కాకుండా మీ భవిష్యత్తుకి కూడా ఉపయోగపడుతుంది. తద్వారా సమాజానికి మంచి పౌరులు లభిస్తారు . దేశానికి ఉపయోగపడే గొప్ప వ్యక్తులు ఎక్కడి నుండో దిగిరారు. మనమే తయారు చేయాలి. ఆ పని మీ ఇంటి నుండే మొదలు పెట్టండి.

. ———@@@@——